ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025
5
శ్రీ సత్యసాయి





హెచ్ఎల్సీ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు

లైనింగ్ కాదు..వెడల్పు చేయండి..!

- కాంట్రాక్టర్ల కోసం రైతులకు అన్యాయం చేయొద్దు
- హంద్రీనీవా కాలువ వెడల్పుతోనే ప్రయోజనం
- వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'జిల్లాకు ప్రాణాధారమైన హంద్రీనీవా కాలువను లైనింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు ఉపయోగం తప్పా రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు... ప్రభుత్వం స్పందించి కాలువను 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేసి, ఆయకట్టుకు నీరు ఇస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.' అని వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు పునరుద్ఘాటించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు, ఏపీ రైతు సంఘం, జలసాధన సమితి ఆధ్వర్యంలో హంద్రీనీవా ఎస్ఇ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. హెచ్ఎల్సి కాలనీ నుంచి ఎస్ఇ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన వహించిన ధర్నాలో ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, జల సాధన సమితి ఎస్ఎం.బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కరువు గురవుతున్న రాయలసీమ జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 1988లో కృష్ణా జలాలలను రాయలసీమకు ఇచ్చేలా హంద్రీనీవాను ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద రాయలసీమ జిల్లాల్లో 6.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో 3.40 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. 40 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నా ఇప్పటి వరకు ఆ స్థాయిలో నీరు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడం సరికాదన్నారు. లైనింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు లాభం జరుగుతుంది తప్పా రైతులకు ఎలాంటి లాభం లేదన్నారు. ఒకరకంగా లైనింగ్ పనులు రైతులకు మరణశాసనంగా మారుతాయన్నారు. లైనింగ్ పనులు నిలుపుదల చేసి కాలువను 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్ఎల్సీ అధికారులకు వినితిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, మల్లికార్జున, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి, సిపిఐఎంఎల్ నాయకులు చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఇమామ్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సిపిఐ శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చితికిన చిన్ననీటి పారుదల..!



- ఈ ఏడాది మొత్తంగా ఒక్క పనీలేదు
- పనుల పురోగతి 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే'



జిల్లాలో చిన్ననీటి పారుదల శాఖలో పనులు ఎక్కడివక్కడే అన్న చందంగా మారాయి. జపాన్ బ్యాంకు సహకారంతో చేపట్టిన పనులతోపాటు విపత్తు నిధుల కింద మంజూరైన పనులు కూడా ఏడాదిగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. రూ.134.18 కోట్ల పనులు చేపడితే ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 60 పనులు చెరువుల మరమ్మతులు, అభివృద్ధి కోసం చేపట్టిన ఈ పనులు కొన్ని మధ్యలోనే ఆగిపోగా, మరికొన్ని ప్రతిపాదనల దశలో ఉండిపోయాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జపాన్ బ్యాంకు నిధులతో ఎపిఐఎల్ఐపి కింద ఐదు పనులు చేపట్టారు. వీటి విలువ రూ.5.93 కోట్లు ఉంది. ఐదు పనుల్లో నాలుగు పనులను కాంట్రాక్టర్లు ఆపేశారు. ఒక్క పని పురోగతిలో ఉందని చెబుతున్నా, ఆశించిన పురోగతి లేదు. అదే నిధుల కిందే మరో పనిని చేపట్టారు. రూ.9.25 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టర్లు బిల్లులు రాక ఆపేశారు. నాబార్డు నిధులతో చేపట్టిన రూ.9.30 లక్షల పనుల పరిస్థితి ఇదే రకంగా ఉంది. పని పూర్తవకనే ముగించేందుకు కాంట్రాక్టర్ సిద్ధమయ్యారు. సాధారణ రాష్ట్ర బడ్జెట్ కింద ఆరు పనులను రూ.61.88 కోట్లతో చేపట్టిన వాటిల్లో ఒక పని కాంట్రాక్టరు నిలిపివేసి ఉండగా, రెండు పనులు ప్రారంభమవ్వాల్సి ఉంది. తక్కిన పనులు సాంకేతిక సమస్యలతో ఆగాయి. స్టేట్ డెవలెప్‌మెంట్ స్కీమ్ కింద రూ.4.66 కోట్లతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్ ఆపేశాడు. విపత్తుల నిధి కింద రూ.48.50 లక్షలతో చేపట్టిన నాలుగు పనులు ఎంఒయు దశలో ఉన్నాయి. అదే నిధులతో మధ్యతరహా ప్రాజెక్టు పనులు పది చేపట్టారు. రూ.3.81 కోట్ల పనులు టెండరు దశలో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నిధులతో 32 పనులు రూ.48.02 కోట్లతో చేపట్టారు. ఇందులో తొమ్మిది పనులు కాంట్రాక్టర్లు నిలిపేశారు. 11 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. తక్కినవి మధ్యలో నడుస్తున్నాయి. ఇలా మొత్తంగా చూసినప్పుడు 2024-25 ఆర్థిక సంవత్సరంలో చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో ఒక్క పనీ పూర్తవలేదు. ఒక్క రూపాయి నిధులు కూడా ఖర్చుపెట్టిన దాఖలాల్లేవు.

కీలకమైన ఈ శాఖ పనితీరు ఇలా ?

వర్షాభావ ప్రాంతమైన అనంతపురం జిల్లాలో చిన్న నీటి పారుదల శాఖ ఎంతో కీలకమైంది. ఎప్పుడో ఒకసారి పడే వర్షాన్ని ఒడిపట్టుకుని నిలువ ఉంచుకోవడం ద్వారా రెండు, మూడు సంవత్సరాలు కరువును ఎదుర్కొనేందుకు వీలుంటుంది. చెరువుల్లోకి వర్షం నీరు చేరితే గండ్లు పడిపోయే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వీటి మరమ్మతులు, నిర్వహణను ప్రభుత్వాలు పూర్తిగా ఎత్తిపెట్టేశాయన్న విమర్శలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అనేక చెరువులకు గండ్లు పడి నీరు వృథాగాపోయిన విషయం తెలిసిందే. చిన్ననీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి సారించాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

నీటి సమస్య తలెత్తనివ్వొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో ఆర్డబ్ల్యూఎస్, డిపిఒ ఆధ్వర్యంలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఉమ్మడి జిల్లా డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జున, డిపిఒ సమత సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటినుంచే తగిన ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాబోయే ఆరు నెలల వరకు వేసవి ఉంటుందని నీటి సమస్య ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసి సీఈఓ కు పంపాలని ఆదేశించారు. అలాగే ఏయే ప్రణాళికలు సిద్ధం చేశారో తనకు కూడా నివేదికలు అందించాలన్నారు. మండలాలు, పంచాయతీల వారిగా గతంలో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉండేదో, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటి అన్న వివరాలు అందించాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. వచ్చేవారం జరిగే సమావేశానికి తగిన నివేదికలతో హాజరు కావాలన్నారు. సత్యసాయి తాగునీటికి సంబంధించిన అధికారులు, నీలకంఠారెడ్డి, శ్రీరామ్ తాగునీటి ప్రాజెక్టు కు సంబంధించిన అధికారులు వచ్చే సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ సుబ్బారావు, డిఇఒ క్రిష్టప్ప, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రొళ్లలో కులవివక్ష.. కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - మడకశిర

రొళ్ల మండలంలో జరుగుతున్న కులవివక్షపై ఆ గ్రామ దళితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అంటరానితనాన్ని నిర్మూలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెవెన్యూ,పోలీస్ యంత్రాంగం అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అయితే శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలంలోని మల్లినమడుగు గ్రామంలో అగ్రవర్ణాలవారు ఇప్పటికీ దళితులపై కులవివక్ష చూపుతున్నారు. ఈ విషయంపై ఆ గ్రామ దళితులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా తమ గ్రామంలో ఉన్న శ్రీ బసవేశ్వర స్వామి దేవాలయానికి తమలపాకుల పూజలు నిర్వహించుకోవడానికి అగ్రవర్ణాల వారు అనుమతించడం లేదన్నారు. కులవివక్ష చూపుతూ దళితులను కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దండోరా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాద్రి, నాయకులు రంగనాథ్, నాగన్న, గ్రామస్తులు రామచంద్రప్ప, భూతరాజు, పరమేష్, కదిరేష్, తిమ్మరాయప్ప, హనుమంతరాయుడు, జగన్నాథ్, తిమ్మరాజు, సురేష్,తదితరులు పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

కల్తీ పాల గుట్టురట్టు..!

బండమీదపల్లిలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం



పాల కల్తీకి ఉపయోగించిన పదార్థాలు

కల్తీపాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. రాప్తాడు మండలంలో వివిధ పదార్థాలతో పాలను కల్తీ చేస్తున్న ఓ వ్యక్తిని గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. అనంతపురం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబిపిటిఎ.ప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ నాగభూషణం, సిఐ సద్గురుడు, ఏవో వాసుప్రకాష్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీం, రెవెన్యూ అధికారులతో కలసి రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం ఎర్రగుంట రామిరెడ్డి ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీ సమయంలో పాలు చిక్కగా కనిపించేందుకు పలు పదార్థాలు వాడుతున్నట్లు గుర్తించారు. పాలు చిక్కగా మారేందుకు పామ్‌ఆయిల్, ఉప్పు, మాల్టోడెక్స్ట్రిన్ పౌడర్, నీటిని కలిపి చిక్కని ద్రవం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ పాలు తాగడం వల్ల గ్యాస్ట్రిక్, క్యాన్సర్ రోగాలు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. కల్తీపాల నమూనాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు సేకరించి పరిశీలన నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. పాల కల్తీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ తెలిపారు. ఎక్కడైనా పాలు కల్తీ చేస్తున్నట్లు తెలిస్తే విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి బాలుర ఉన్నత పాఠశాలలో 1973-74 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులుపట్టణంలోని దేవస్థానం వీధి లో వున్న శ్రీ ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా తమ అప్పటి గురువులను సన్మానించారు. ఇకపై తమ మిత్రబృందంలో ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లల చదువుల కోసం సహాయ సహకారాలను అందించాలని పూర్వవిద్యార్థులు ఈ సందర్భంగా నిర్ణయించుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తోటి మిత్రుని అమ్మాయి ఉన్నత చదువుల కోసం తమవంతు సాయంగా 30వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులు రామలింగయ్య, కార్యదర్శి బాషాతో పాటు పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆసంఘం నాయకులు సిఎం చంద్రబాబునాయుడిని కోరారు. ఉండవల్లిలో సిఎం చంద్రబాబును బీసీ ఉద్యోగులు సంఘం నాయకులు చింతా నాగరాజు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు చేనేత వస్త్ర వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. వస్త్ర వ్యాపారులు పడుతున్న ఇబ్బందుల పై కమిటీని నియమించి విధి విధానాలను రూపొందిస్తామని సిఎం హామీ ఇచ్చారని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, ధర్మవరం వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు గిరిరాజు రవి , నీలూరి శీన, శశి, హేమంత్, రమణ తదితరులు పాల్గొన్నారు

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి : ఎస్పీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల

ఆర్మడ్‌రిజర్వుడు పోలీసులు శ్రీ సత్యసాయి జిల్లా పేరు నిలబెట్టేలా విధులు నిర్వర్తించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన శ్రీ సత్యసాయి జిల్లా ఏఆర్‌డి మొబలైజేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన మొబలైజేషన్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఎస్పీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ ఆర్ఐ మహమ్మద్ వలి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పరిశీలన వాహనంపై వెళ్లి ఏ.ఆర్ ప్లటూన్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షించడంలో జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. అనేకమైన భద్రత విధులు, ప్రజా సేవలను సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన సంఘటనలలో సాంఘిక, రాజకీయ, మతపరమైన, అధికార కార్యక్రమాలలో ఏ ఆర్ శాఖ అత్యంత క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసు విభాగానికి ఎంతో పేరు తీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం జిల్లా ప్రశాంతంగా ఉందంటే ఏఆర్ విధులే కారణమన్నారు. తాను మొట్టమొదట జిల్లాలో విధులు చేపట్టినప్పుడు మడకశిర ప్రాంతంలోని గుండుమల గ్రామంలో జరిగిన ముఖ్యమంత్రి పోగ్రాంను విజయవంతం చేయడంలో ఎంతో కీలకంగా పనిచేశారన్నారు. జిల్లాలో జరిగిన వినాయక నిమజ్జనం, గొడవలు రాజకీయ సంఘటనలు ఆందోళనలు ప్రదర్శనలలో అత్యంత కీలకమైన భద్రతా విధులు నిర్వహించారన్నారు. హిందూపురం, తాడిమర్రి ,ఇస్తిమా సందర్భంగా భద్రతా చర్యలు చేపట్టడమే కాక, శ్రీ సత్య సాయి బాబా 99 వ జయంతి ఉత్సవాలు పాల్గొన్న రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర డిజిపి విఐపి భద్రత ఏర్పాటు చేయడంతో పాటు స్వతంత్ర దినోత్సవం పోలీస్ స్మారక దినోత్సవం గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రమశిక్షణతో కవాతు పరేడ్ నిర్వహించారన్నారు. ఏఆర్ సిబ్బందికి ప్రతీ ఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్ నెస్ ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎఆర్ పోలీసుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందులో భాగంగానే వైద్య శిబిరం నిర్వహించడంతోపాటు యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దష్టికి తీసుకురావాలని సూచించారు. మొబిలైజేషన్ ప్రక్రియ లో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి , మొబిలైజేషన్ లో ఫైరింగ్, టర్న్ అవుట్ అండ్ ప్రొఫిషియెన్సీ పే టెస్ట్, డ్రైవింగ్ లో ప్రతిభ కనబరచిన వారికి ఎస్పీ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, ఆర్ఐలు మహమ్మద్ వలి, మహేష్ , ఆర్ఎస్ఐలు, వీరన్న ప్రదీప్, సింగ్ ప్రసాద్ ఎఆర్.సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన బహిష్కరణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మాజీ మావోల ఇళ్లస్థలాల సమస్యలపై ఆర్డీవో చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని లబ్ధిదారులు బహిష్కరించారు. భూ కబ్జాదారులు , పెత్తందారులను ఈ క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులు ఆహ్వానించడాన్ని మాజీ నక్సలైట్లు, వారికి మద్దతు తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వ్యతిరేకించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు వారు మాట్లాడుతూ ఇప్పటికి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇరు వర్గాలను పిలవడం వల్ల వివాదాస్పదంగా మారి గొడవలు జరిగే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా 2 విడతలుగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. హక్కుదారులకు న్యాయం చేయాలన్న కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాతపూర్వకంగా మాజీ మావోలు ఆర్డీవో వ్యక్తిగత వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మావోలు బాలు, శ్రీనివాసులు, రత్న కుమార్, శ్రీరాములు, ఆదినారాయణప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థులతో కోచ్

కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

విశాఖపట్నం పోర్ట్ స్టేడియంలో ఈ నెల 1,2 తేదీన విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన 8 వ ఆల్ స్టైల్స్ ఆహ్వానపు అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో కదిరికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. యునైటెడ్ షోటోఖాన్ కరాటే డో ఇండియా,మహిరా షోటోఖాన్ కరాటే డో ఇండియా టోర్నమెంట్ ఆర్గనైజర్స్ హైదర్ అలీ, తాజోద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్ పోటీలకు నేపాల్,బూటన్,శ్రీలంక దేశాల నుండి క్రీడాకారులు హాజరైనారు.ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా సినీ హీరో, కరాటే సుమన్ తల్వార్, విశాఖపట్నం మౌర్య సింహ, కోరమండల్ సంస్థ అధికారి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు కరాటే గురించి వాటి వల్ల కలుగు లాభాలను తెలియజేశారు.కరాటే మాస్టర్ షాకీర్‌కి బెస్ట్ టీం అవార్డును వారి చేతుల మీదుగా అందించారు.ఈ పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన వివిధ పాఠశాల లో చదువుకుంటున్న విద్యార్థులు కాటస్, కుమితే విభాగాలలో మొత్తం 13 మంది విద్యార్థులు 26 విభాగాలలో పోటీ చేయగా 12 బంగారు పతకాలు,10 రజిత పతకాలు,4 కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన షాకిర్‌ను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డుపై విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - రొద్దం

రోడ్డుపై వేసిన మోటార్ విద్యుత్ తీగలు ప్రమాదాలకు నిలయంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని కోగిర గ్రామ సమీపంలో కంచి సముద్రం వెళ్లే రెండు వరుసల ప్రధాన రహదారిలో దాదాపు అర్ధ కిలోమీటర్ వరకు రోడ్డుపై, ముళ్లకంపలపై విద్యుత్‌తీగలు వేశారు. దీంతో రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై ఉన్న తీగలను తక్షణమే తొలగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రోడ్డుపై వేసిన విద్యుత్ తీగలు

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని బిచర్ల, గొర్లవాండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వేరుశెనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

భవిత కేంద్రం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో పాత తరగతి గది స్థానంలో మండలంలోని వికలాంగుల పిల్లల కోసం భవిత కేంద్రం నిర్మించటకు ఆర్డీటీ వారు ఆమోదం తెలిపినట్లు ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ తెలిపారు. పాత తరగతి గది పడగొట్టి అందులోని సైజు రాళ్ళు,ఇనుప వాసాలు బహిరంగ వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 7న రూ 5 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.

కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల కేంద్రంలోని కెజిబివిని తహశీల్దార్ అనంతాచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వంటశాలను, పాఠశాల పరిసరాలను, వాటర్ ట్యాంకులను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను, భోజన మెనూను పరిశీలించి విద్యార్థులను అందిస్తున్న ఆహారంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎస్ఒకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి చేపట్టిన ప్రణాళికలను తెలుసుకొని, మరింత శ్రద్ధ వహించి గతం కన్నా మంచి ఫలితాలు తీసుకురావాలని తెలిపారు.

వీరజవాను వర్ధంతి

ప్రజాశక్తి - లేపాక్షి

దేశ సేవలో వీరమరణం పొందిన మండలం పరిధిలోని కోడిపల్లి గ్రామానికి వీర జవాన్ చంద్రశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వీర జవాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో కోడిపల్లి వీర జవాన్ మిత్రులు, గ్రామస్తులు, టిడిపి నాయకులు గంగాధరప్ప, నాగరాజు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - గాండ్లపెంట

జాతీయ రహదారుల వారోత్సవాలలో భాగంగా మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ అసిస్టెంట్ ఇనిస్పెక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలను నడిపేటప్పుడు నియమాలు పాటించాలన్నారు. రోడ్డు భద్రత పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి, పామిడి ముంతాజ్ అలీ, విశ్వనాథ్ రెడ్డి, పోలీసులు శ్రీనివాసులు, భాస్కర్, రాజు, మురళి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు అనంతరం భగత్ సింగ్ ఆటో యూనియన్ నాయకులు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ అసిస్టెంట్ ఇనిస్పెక్టర్ రాజేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ బాబు, నాగేంద్ర, శ్రీరాములు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి

ప్రజాశక్తి - లేపాక్షి

మండలం పరిధిలో ని కంచిసముద్ర పంచాయతీ లో గల అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకహార వాటిక కేంద్రాన్ని సీడీపీఓ శాంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 13అంగన్వాడీ కేంద్రాల్లో పోషక వాటికలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోషక వాటికలలో ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు పండించి పిల్లలకు, గర్భిణులకు అందించడంతో పాటు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు రూప, మహిళా పోలీసు, మహిళలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతు ప్రవేటు పాఠశాలల యాజమానాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల, కోశాధికారి రియాజ్, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు సతీష్, ముస్తఫా ఆలి ఖాన్, రాధాకృష్ణ, శేషగిరి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని మరిమేకలపల్లి గ్రామ రైతు మల్లన్నకు చెందిన పొలంలో స్పింక్లర్లు, డ్రిప్పు వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బాధిత రైతును మంగళవారం పరామర్శించారు. తమవంతు సాయంగా రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఆకులేటి అశ్వత్, ముసుగు శ్రీనివాసులు, బెల్లం తిరుపాలు, నారాయణస్వామి, జింక ఈశ్వరయ్య, బెడదూరి సత్యం తదితరులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిని ఇస్తున్న సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు కోరారు. మంగళవారం ఈ విషయంపై పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో టిడిపి ఇన్‌చార్జ్ శ్రీనివాస్ రావును సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు, పురపాలక సంఘాన్నే నమ్ముకుని దాదాపు 35 సంవత్సరాల నుండి 220 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేసే వారందరిని పర్మినెంట్ చేస్తామని చెప్పి మాటతప్పిందన్నారు. దీంతో పాటు ఆప్కాస్ విధానం తీసుకువచ్చిందన్నారు. ఈ విధానం వల్ల విశ్రాంతి పొందిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక పోగా వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సైతం ఇవ్వ లేదన్నారు. హిందూపురం పురపాలక సంఘంలో గత కొంత కాలంగా ఆప్కాస్ విదానంలో పని చేస్తున్న 10 మంది కార్మికులు మృతి చెందారని వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదని అన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్న పరిస్థితి ఉందన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులను ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో కొంత మందిని అదనపు పారిశుధ్య కార్మికులుగా పురపాలక సంఘం వారు తీసుకున్నారని వారికి జీవో నెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, సహాయ కార్యదర్శి గురునాథ్, కోశాధికారి ఆనంద్, జాయింట్ సెక్రెటరీ చంద్ర, ఉపాధ్యక్షులు రామచంద్ర, నాయకులు బాబయ్య, రమేష్, మహిళా నాయకులు ఓబులమ్మ, సుబ్బులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - మడకశిర

గ్రామీణ ప్రాంతాలలో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడానికి ఆశా వర్కర్లు కృషి చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ మంజువాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం మండల పరిధిలోని నీలకంఠాపురం ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భం డాక్టర్ మంజువాణి మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు వారివారి ఏరియా పరిధిలో ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ఆరోగ్య సేవలు గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ భార్గవి, ఆశావర్కర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్లుమర్రి పిహెచ్‌సి తనిఖీ : మండల పరిధిలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తనిఖీ చేశారు. ఆశా డే సమావేశానికి హాజరై, ఆరోగ్య సంరక్షణ అంశాలపై ఆశా వర్కర్లకు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి, ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ మధుర్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోనే మరుకుంటపల్లి గ్రామంలో సత్యసాయి బాబా భక్తులు ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్‌జె. రత్నాకర్ రాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూలల ప్రాంతాలలో ప్రజలకు శుద్ధమైన నీరు అందించాలని ఉద్దేశంతోనే వీటిని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ వాటర్ ప్లాంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున తమ దృష్టికి రావడంతో ప్లాంట్‌ను ఇక్కడ ఏర్పాటు చేసామన్నారు. అనంతరం ఆయనను గ్రామ ప్రజలు సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సత్యసాయి భక్తులు థామస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న రత్నాకర్

కులగణన చేపట్టాలి

ప్రజాశక్తి - మడకశిర

ఎపిలోని కూటమి ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేపట్టాలని సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా చేపట్టిన కులగణన ఒక చారిత్రాత్మకమని అన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కూడా కులగణనను కూటమి ప్రభుత్వం చేపట్టాలని కోరారు. సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలపడం దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ లో తీర్మానం చేయడం హర్షణీయమని అన్నారు.

పారిశుధ్య చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింప జేసేందుకుకమిషనర్ ప్రహల్లాద ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గత రెండు రోజులుగా కమిషనర్ దగ్గర ఉండి పారిశుధ్య కార్మికులతో చెత్తచెదారాన్ని తొలగింపజేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వీధి, పెద్ద కమ్మవారిపల్లి, చిత్రావతి రహదారి, చిత్రావతి పరివాహక ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. అలాగే ఎనుగులపల్లి రహదారిలో గుంతలు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు పారిశుధ్యం పై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కమిషనర్ పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించారు.

ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఏర్పాటు

పుట్టపర్తి క్రైమ్ : సత్యసాయి జిల్లా ఏపీ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని జానకి రామయ్య కళ్యాణ మండపంలో మంగళవారం ఎన్నుకున్నారు. ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా ల్యాబ్ టెక్నీషియన్ ప్రాముఖ్యతను బాధ్యతలను వివరించారు. అలాగే వారి సమస్యలను విని కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. జిల్లా అధ్యక్షులుగా జనార్దన్, కార్యదర్శిగా మస్తాన్ వలి, కోశాధికారిగా అనిల్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా నాగుల సుంకన్న, వైస్ ప్రెసిడెంట్‌గా సునీత తదితరులను ఎన్నుకున్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో పేట వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని సింగర్ చౌక్ వరకు తీసుకువచ్చారు. 5న సుప్రభాత సేవ, విద్యుత్ దీపాలంకరణ, 6న అభిదేయ అభిషేకము, ప్రాకారోత్సవం హనుమద్వాహనం వంటి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నరసింహమూర్తి తెలిపారు. అలాగే 7న తిరుమంజిన సేవ, సింహ వాహనం, 8వ తేదీన ప్రాకారోత్సవం, సహస్ర దీపాలంకరణ, 9వ తేదీన ప్రాకారోత్సవం అభిదేయక అభిషేకం, పదవ తేదీన గజవాహన నగరోత్సవం వంటి పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా 11వ తేదీన తిరుమంజన సేవ, దీపోత్సవం తో పాటు సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 12వ తేదీన సుప్రభాత సేవ, ప్రాకారోత్సవం, శ్రీవారి బ్రహ్మరథోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు 13వ తేదీన అశ్వవాహనం, పార్వేట ఉత్సవం, 14వ తేదీన ధ్వజారోహణం, ఉయ్యాలోత్సవం, 15వ తేదీన సుప్రభాత సేవ, శయనోత్సవం వంటి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్ తో పాటు టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, రాయల్ గోపాల్, భగీరథ నవీన్ పలువురు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి : ఎస్పీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

వాహనదారులు సీటు బెల్టు, హెల్మెట్లతో ప్రయాణం చేస్తే సుఖవంతమైన ప్రయాణం అవుతుందని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. జాతీయ రహదారి మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని రెండవ పోలీస్ స్టేషన్ వద్ద నుండి రైల్వే ఓవర్ బ్రిడ్జి కళాజ్యోతి సర్కిల్ ఎన్టీఆర్ సర్కిల్ గాంధీనగర్ సర్కిల్ వరకు సాగింది. సీఐలు, డి.ఎస్.పి హేమంత్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ రత్న మాట్లాడుతూ సీటు బెల్ట్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ప్రమాదాలు జరగడంతో పాటు మరణాలు కూడా సంభవిస్తాయని అన్నారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించి ప్రమాదరహిత ప్రయాణం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హేమంత్ కుమార్, ట్రయినీ డీఎస్పీ పావని, వన్‌టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్, 2 టౌన్ సిఐ రెడ్డప్ప, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ఎస్ఐలు, సచివాలయ మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, తదితరులు

ప్రతిభా విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

జాతీయ స్థాయి డాన్స్ స్పోర్ట్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కదిరి మనుస్ డాన్స్ అకాడమి విద్యార్థులు, కోచ్ మనోహర్ సోమవారం రాత్రి అనంతపురం నగరంలోని క్రీడా జిల్లా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో శాప్ చైర్మన్ రవినాయుడుని కలిశారు. ఈసందర్భంగా రవి నాయుడు ప్రతిభా విద్యార్థులను అభినందించారు. డాన్స్ ను డాన్స్ స్పోర్ట్ గా చేసి 2024లో ఒలింపిక్ గేమ్స్ లో మొదటిసారి పొందుపర్చారన్నారు. ఈ మధ్య పంజాబ్‌లో జరిగిన 15వ జాతీయ డాన్స్ స్పోర్ట్ ఛాంపియన్షిప్ 2025 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 15మంది పాల్గొన్నారని డ్యాన్స్ మాస్టర్ మను తెలిపారు. అందులో 8మంది ద్వితీయ, తతీయ స్థానాలు కైవసం చేసుకున్నారని శాప్ చైర్మన్ కు వివరించారు. రాబోయే రోజుల్లో డాన్స్ స్పోర్ట్ కు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, మిగిలిన స్పోర్ట్స్ మాదిరిగా డాన్స్ స్పోర్టుకు నిధులు కేటాయిస్తామని చైర్మన్ భరోసా కల్పించారని డాన్స్ మాస్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాన్స్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18న నాయిబ్రాహ్మణుల విజయభేరి

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఈనెల 18న గోరంట్ల లో జరిగే నాయీ బ్రాహ్మణుల విజయభేరిని సభకు విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు విజయబేరికి సంబందించిన పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎం అంజి, నాయకులు శ్రీనివాసులు, వెంకటరమణ, పెద్ద రామన్న, తిమ్మయ్య, హరిబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని జమ్మానిపల్లి గ్రామంలో మంగళవారం పవువైద్యశిబిరం నిర్వహించారు. వెటర్నరీ సిబ్బంది మేకలు గొర్రెలకు పిపి ఆర్ వ్యాక్సిన్ వేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది వెంకటేష్, నటరాజు, భరత్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానాన్ని మంగళవారం మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల ఆకలి తీర్చేందుకు ప్రతిరోజు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ను సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 380 మందికి అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మంగేష్, మహేష్, రాజ్యలక్ష్మి మోహన్, అంజి, వెంకటరమణప్ప, గొల్లన్న, రామకీష్ణ, వరుణ్, బసప్ప తదితరులు పాల్గొన్నారు



భోజనం వడ్డిస్తున్నచైర్మన్

దేశవ్యాప్త నిరసనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 5న జరిగే నిరసన ర్యాలీ లలో ఉద్యోగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యాలయం లో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కార్మికవర్గానికి ప్రస్తుతం వున్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్ ముఖ్య ఉద్దేశం అన్నారు. సరళీకరణ విధానాల అమలులో భాగంగా ప్రస్తుత కార్మిక చట్టాలు తెలుస్తున్నారన్నారు. కార్మికహక్కులు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికి లేబర్ కోడ్ ను తెచ్చారన్నారు. కార్మిక చట్టాలు అమలులోకి తెచ్చి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా పనిచేయించి దోపిడీని మరింత తీవ్రతరం చేయబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గాన్ని చైతన్యపరిచి, లేబర్ కోడ్ ప్రమాదాన్ని వివరించడం జరుగుతుందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధం అయితే కార్మిక వర్గం నిరవధిక సమ్మెలకు సిద్ధంకావాలి, లేకుంటే కార్మికవర్గం బ్రతకడమే కష్టమవుతుందని అన్నారు. ఏ హక్కులు లేనప్పుడే కార్మిక వర్గం పోరాడే హక్కులు సాధించిందని గుర్తు చేశారు. ఉన్న హక్కులు లేకుండా చేస్తామంటే కార్మికవర్గం కళ్ళు ముకునుకొని కూర్చో దన్నారు. కార్యక్రమంలో సిఐటియు పుట్టపర్తి కోకన్వీనర్ పెడపల్లి బాబా, బుక్కపట్నం మండల కన్వీనర్ బ్యాళ్ళ అంజి, కొత్తచెరువు మండల కన్వీనర్ ముత్యాలు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే అందరి అజెండా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అమడగూరు

ప్రజల సమస్యల పరిష్కారమే అందరి అజెండా అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగు నీటి సమస్య రాకుండా స్థానిక సర్పంచులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రజలకు అభివృద్ధి జరగాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు నైట్ వాచ్ మెన్ల సమస్య పరిష్కరించాలని ఎంఇఒ జిలాన్ భాష కు సూచించారు. మండలంలో ఇల్లు లేని పేదలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు వారి పంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మండల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, పట్టణ మౌలిక వసతుల కల్పన రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్, తహశీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీవో మునేప్ప, వైద్యాధికారి అపర్ణ, హౌసింగ్ ఏఈ రమేష్‌తో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

పాడి ఆవులు అపహరణ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు మండల పరిధిలో ఇండ్ల వెంకటంపల్లిలో వ్యవసాయ పొలంలో షెడ్డులో ఉన్న మూడు పాడి ఆవులను దుండగులు అపహరించారు. రైతు పణిధర్ రెడ్డి తలమర్లలో నివాసం ఉంటూ ఇండ్ల వెంకటం పల్లి లో వ్యవసాయ పొలంలో షెడ్ ఏర్పాటు చేసుకొని ఆవులను పోషిస్తున్నారు. సోమవారం రాత్రి యథా ప్రకారం పాడియావులకు మేపువేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం ఆవుల షెడ్డు వద్దకు వెళ్లగానే ఆవులు కన్పించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడు ఆవులు కలిపి దాదాపు రూ.2.30 లక్షల విలువ చేస్తాయని, వీటితోనే కుటుంబం జీవనం సాగించేవాడని చెప్పాడు. కుటుంబ పోషణ భారమవుతుందని తమను ఆదుకోవాలని కోరాడు.

పంట పొలానికి నిప్పు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మాజీ డీలర్ రామాంజనప్పకు చెందిన రెండెకరాల మొక్కజొన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. ఈ ప్రమాదంలో మొక్కజొన్న పంట, డ్రిప్పు పైపులు కాలిపోయినట్లు రైతు వాపోయారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు పంట పక్కన ఉన్న ముళ్ళకంపలకు నిప్పు పెట్టడంతో అది కాస్త పంట పొలంలోకి వచ్చి మొక్కజొన్న పంట, డ్రిప్పు పైపులు కాలి బూడిద అయ్యాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



వ్యాపించిన మంటలు

అడివికి నిప్పు : మండలంలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో గాలిమరల సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అడివికి నిప్పు పెట్టారు. దీంతో మొత్తం చెట్లు కాలి బూడిద అయ్యాయి. రోడ్డు పక్కనే అడవి ఉండడంతో రోడ్డుపై వెళ్లే ఆకతాయిలు నిప్పుపెట్టారు. రెండురోజులుగా ఈతంతు సాగుతోంది. సమాచారం అందుకున్న రేంజ్ ఆఫీసర్ తమ సిబ్బందిని అక్కడ పంపించి పక్కనే ఉన్న సబ్‌స్టేషన్ అధికారులతోకలిసి మంటలను ఆర్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మండలంలోని వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనటుల రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. గ్రామానికి చెందిన 40 సంవత్సరాల ఈడిగ మస్తాన్ గత సంవత్సరం నవంబర్ 7న కదిరిలో తన స్నేహితుడు పెళ్లికి వెళుతున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆయన భార్య లావణ్య ఫిర్యాదు చేసినటుల చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

'మధ్యాహ్న భోజనం' సరుకుల తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగమైన బియ్యం,కోడి గుడ్లు పక్కదారి పట్టిన విషయంపై గ్రామస్తుడు షేక్ బాబ్జాన్ కలెక్టర్ టి ఎస్ చేతన్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలో నాలుగు జిల్లా ఉన్నత పాఠశాలలు, 53 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బియ్యం,కోడి గుడ్లు పక్కదారి పడుతుంటే మారుమూల గ్రామాలలో ఇంకెన్ని అక్రమాలు జరుగుతున్నాయోనని అనుమానం వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల్లో భోజన వస్తువులు ఏజెన్సీల ఇళ్లకే ఉపాధ్యాయులు చేరవేయడంతో ఈ వస్తువులన్నీ బ్లాక్ మార్కెట్‌కు తరలివెళు తున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాంద్ బాషా, కొవ్వూరు వెంకటరమణ, గురివి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ మెగా లోక్‌అదాలత్

ప్రజాశక్తి-హిందూపురం

ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మార్చి 8వ తేదీన రెండవ శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ తెలిపారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ మెగా లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సివిల్ కేసులతోపాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, భరణం కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకొని కక్షిదారులకు ఆమె సూచించారు.

సిలిండర్‌పై అదనంగా వసూలు చేస్తే లైసెన్స్ రద్దు : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో గ్యాస్ సిలిండర్ తీసుకుంటున్న లబ్ధిదారులతో అదనంగా వసూలు చేస్తే ఆ ఏజెన్సీ బ్లాక్ లిస్టులో పెడతామని అలాగే లైసెన్స్ కూడా రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. ఈ మేరకు జెసి కలెక్టరేట్ నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిలిండర్ డెలివరీ చేస్తున్న బాయ్ లు అదనంగా సిలిండర్ గ్యాస్ ధరకు మించి రూ. 80 నుంచి 150 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదే నిజమని తేలితే ఆయా ఏజెన్సీలు రద్దు చేస్తామని నిర్వాహకులకు హెచ్చరించారు. అలాగే పలువురు లబ్ధిదారులు సిలిండరుకు చెల్లించిన మొత్తం తిరిగి తమ ఖాతాలో జమ కాలేదని చెబుతున్నారన్నారు. అలాంటి లబ్ధిదారులు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 08555–289039కి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చాన్నారు.

క్యాన్సర్ నివారణలో ముందస్తు జాగ్రత్తలే కీలకం

ప్రజాశక్తి-హిందూపురం

క్యాన్సర్ నివారణలో ముందస్తు జాగ్రత్తలు పాటించడమే అత్యంత కీలకమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. వెంకటేశులు పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక యన్.యస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, జంతు శాస్త్ర విభాగపు సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం, డ్రగ్స్, హాని కలిగించే పొగాకు ఉత్పత్తుల వినియోగంలో సామాన్యులకి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. భోజప్ప, యన్ సి సి ఆఫీసర్ డా. సరస్వతి, యన్ యస్ యస్ ప్రోగ్రాం అధికారి ఎస్. రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ అమరేష్, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రెడ్ రిబ్బన్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్సలను పొందాలని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ డే గూర్చి ప్రజలకు పలు విషయాలను తెలియజేశారు. క్యాన్సర్ వ్యాధితో మృతిచెందిన వారి సంఖ్య పెరుగుతోందని ఇందుకు కారణం వ్యాధిని తొలి దశలో గుర్తించలేకపోవడమే నని చెప్పారు. స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, గర్భకోశ ముఖ ద్వారం వద్ద ఈ వ్యాధులు వస్తాయని, పురుషులకు ఊపిరితిత్తులు, గొంతు, కడుపు, పేగుల క్యాన్సర్ వస్తుందని తెలిపారు. అంతేకాకుండా పొగాకు వల్ల ఏ రూపంలోనైనా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

అవగాహన ర్యాలీ : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి నుండి పట్టణంలోని పలు వీధులు గుండా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారముగా ఏర్పడి క్యాన్సర్ వ్యాధి నివారణ విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డాక్టర్లు నజీర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ సెల్వియా సల్మాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ,సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.